కంచరకుంట తూంను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిదులు, అధికారులు(ఫైల్)



ఎక్స్‌కవేటర్ సాయంతో సాగుతున్న కాల్వ మరమ్మతు



నీరు సాఫీగా వెళ్లేందుకు చేపట్టిన కాల్వ విస్తరణ పనులు



## కంచరకుంట చెరువు నీటి తరలింపునకు

# బల్దియా ప్రత్యేక చర్యలు

- లోతట్టు ప్రాంతాలకు తప్పనున్న వరద ముప్పు
- ముమ్మరంగా సాగుతున్న ప్రత్యామ్నాయ పనులు

కోరుట్ల, జూలై 19: వర్షాకాలం వచ్చిందటే చాలు లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. ఎప్పుడు వర్షం పడుతుందో వరద నీరు ఇళ్లలోకి వచ్చి ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అనే బెంగ వారిని వెంటాడుతూ ఉండేది. పట్టణ శివారులో ఉన్న కంచరకుంట చెరువు నుంచి తూము ద్వారా లోతట్టు ప్రాంతాలైన ఆదర్శనగర్, ప్రకాశం రోడ్డు, ఝాన్సీరోడ్డు గుండా ప్రవహిస్తూ కోరుట్ల పూల్ వాగులో కలిసేది. కాల్వలు కబ్జాకు గురవడంతో వరద నీరు పోటెత్తి సమీప కాలనీల్లోకి వరద చొచ్చుకు రావడంతో కాలనీలు జల దిగ్బందంలో చిక్కుకునే పరిస్థితి వచ్చింది. వర్షాకాలంలో కంచరకుంట చెరువు మత్తడి నుంచి వచ్చిన నీరు మద్దుల చెరువులోకి వచ్చే క్రమంలో కాల్వలు ఇరుగ్గా మారడంతో రహదారులపై నీరు చేరి ఆదర్శనగర్ కాలనీ నీట మునిగేది. మద్దుల చెరువు తూం నుంచి వచ్చిన నీరు ప్రకాశం రోడ్డు, ఝాన్సీ రోడ్డు కాలనీలను ముంచి వేసేది.

### వరదకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు

వరదకు అడ్డుకట్ట వేసేందుకు బల్దియా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా వరద కాలనీలను ముంచెత్తడానికి గల కారణాలపై అన్వేషణ మొదలుపెట్టారు. కంచరకుంట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన నీరు కాల్వలు పూరుకుపోవడం, కొన్నిచోట్ల కబ్జా గురవడాన్ని గమనించారు. దీంతో మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో నీరు సాఫీగా వెళ్లేలా కాల్వలకు మరమ్మతు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. పాత కాల్వను పునరుద్ధరించి పూడికతీత పనులు చేపట్టారు. నీరు పట్టణంలోని కాలనీల్లోకి రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొని నీటి మళ్లింపునకు పనులను ప్రారంభించారు. కంచరకుంట చెరువు నుంచి వచ్చే వరద నేరుగా ఎస్సారెస్పీ డీ పార్టీ కెనాల్, కిషన్‌రావు పల్లె, ఐలాపూర్ చెరువుల్లోకి వెళ్లేలా కాల్వ నిర్మాణానికి పూనుకున్నారు. తద్వారా వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు వరద నీటి గండం తప్పనుంది.

### కల్వకుంట్ల సంజయ్ చొరవతో..

బీఆర్ఎస్ రాష్ట్ర నేత కల్వకుంట్ల సంజయ్ ఇంటింటికీ సంజయన్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాలైన ప్రకాశం రోడ్డు, ఝాన్సీరోడ్డులో ఆయన ఇంటింటా తిరుగుతూ సమస్యలపై ఆరా తీశారు. కాలనీవాసులు వరదనీటి సమస్యలపై సంజయ్‌కు మొర పెట్టుకున్నారు. వెంటనే స్పందించిన సంజయ్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కంచరకుంట చెరువు, తూంను పరిశీలించారు. తూం నుంచి దిగువ భాగానికి చేరుతున్న నీటి మళ్లింపునకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులతో చర్చించారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

### వరద మళ్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం



వరద ఆదర్శనగర్, ప్రకాశం రోడ్డు, ఝాన్సీ రోడ్డు కాలనీల్లోకి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం గతంలో నిర్మించిన మురుగు కాల్వలను విస్తరించేందుకు పనులు చేస్తున్నాం. కాల్వల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించి నీరు వాగులోకి సాఫీగా వెళ్లేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. కాల్వల పునరుద్ధరణ కోసం ఇప్పటివరకు రూ.2.50 లక్షలు ఖర్చు చేశాం.

**- మహ్మద్ అయాజ్, మున్సిపల్ కమిషనర్, (కోరుట్ల)**

## మంత్రిని కలిసిన మున్నూరు కాపు సంఘ సభ్యులు



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మపురి, జూలై 19: మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు, బుగ్గారం జడ్పీటీసీ బాదినేని రాజేందర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం, లైబ్రరీ, కమ్యూనిటీ హాల్‌కు స్థలం మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, రైతు బంధు సమితి అధ్యక్షుడు సౌళ్ల భీమయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మొగిలి శేఖర్, బీఆర్ఎస్ నేత సంగి శేఖర్, కౌన్సిలర్ బండారి అశోక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పులిశెట్టి మల్లేశం, ధర్మపురి పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చీపురుశెట్టి రాజేశ్, ఆర్థిక కోశాధికారి కాసెట్టి రాంబాబు, ఉపాధ్యక్షులు సోమిశెట్టి శివసాయి, స్తంభంకాడి మహేశ్, సంయుక్త కార్యదర్శి ఒడ్నాల భూమేశ్, సెక్రటరీ చుక్క రవి, నాయకులు పాల్గొన్నారు.

## జోరు వానలో సంజయ్ పర్యటన



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సంజయ్

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని 28వ వార్డులో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నేత కల్వకుంట్ల సంజయ్ ఇంటింటా పర్యటించారు. ఓవైపు జోరుగా వాన కురుస్తున్నప్పటికీ ఇంటింటికీ సంజయన్న కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులను ఆత్మీయంగా పలుకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని ఆరా తీశారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం గడపగడపకూ సం క్షేమ పథకాలను కులమతాలకు అతీతంగా అందిస్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని, ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు బట్టు సునీల్, సురేందర్ ఉన్నారు.

## 'సభను విజయవంతం చేయాలి'

మేడిపల్లి, జూలై 19: జిల్లా కేంద్రంలో ఈ నెల 27న జరిగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ బలవంతుల సురేశ్ పిలుపునిచ్చారు. బుధవారం తొంబర్‌రావుపేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ బలవంతుల సురేశ్, మండల కన్వీనర్ బొమ్మెన కపిల్ సమక్షంలో గ్రామ కన్వీనర్‌గా చెప్యాల ప్రవీణ్‌కుమార్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోరుట్ల మండల కన్వీనర్ కుంటాల శ్రీనివాస్, పోరుమల్ల గ్రామ శాఖ కన్వీనర్ శేఖర్, సంజీవ్, సంఘం అధ్యక్షుడు జాగర్ల విజయ్, చిట్యాల నర్సయ్య, అంతడుపుల రాజేశ్, మహేశ్, నాని, వంశీ, లింగం తదితరులు పాల్గొన్నారు.

## తపస్ సభ్యత్వ నమోదు

మేడిపల్లి, జూలై 19: కొండాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, భీమారం మండలం రంగాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు మల్హాల్‌రావు, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కాదర్ల రాజేంధర్, తిరుమల్‌రావు, వెంకటేశ్వర్లు, రాజేందర్, అంకం రాజ్యలక్ష్మి, ఏనుగు అనూషతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, జూలై 19: పట్టణ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన ఖాళీ సీట్లలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమా ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సివిల్, ఇంజినీరిగ్ విభాగాల్లో పలు సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ వర్తించదని, సంవత్సరానికి రూ. 5080 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9010222187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## జిల్లా అధికార ప్రతినిధిగా నర్సింహులు



నర్సింహులు


కథలాపూర్, జూలై 19: ఆర్ఎంపీ, పీఎంపీ యూనియన్ జిల్లా అధికార ప్రతినిధిగా కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన బ్యాగరి నర్సింహులు నియమితులైనట్లు ఆ సంఘం నాయకులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింహులు కథలాపూర్ మండలాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు పేర్కొన్నారు. నర్సింహులు నియామకంపై మండల ఆర్ఎంపీ, పీఎంపీలు హర్షం వ్యక్తం చేశారు.

## ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

పెగడపల్లి, జూలై 19: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బీ వినీల బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని స్పష్టం చేశారు. నాసిరకం అమ్మితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన విత్తన నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఏఈవో మల్లేశం, అశోక్ ఉన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి, జూలై 19: మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగు నివారణ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వైద్యాధికారి నరేశ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య శాఖ సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి నరేశ్

# ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, జూలై 19: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేరుతుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన పద్మావతికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.25లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే బుధవారం లబ్ధిదారు ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఇంటికే వచ్చి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు పద్మావతి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జగిత్యాల పట్టణం, అర్బన్ మండలాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.3 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు ముస్కు నారాయణ రెడ్డి, క్యాదాసు నవీన్, నాయకులు రంగు మహేశ్, రామకృష్ణారెడ్డి, మహేందర్ రావు, తదితరులున్నారు.

### 15 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

జగిత్యాల పావని కంటి దవాఖాన, జగిత్యాల ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు దుమాల రాజ్‌కుమార్, రంగు మహేశ్, అర్వపల్లి శ్రీనివాస్, ఎలుమాద్రి కిశోర్, డాక్టర్ విజయ్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.